సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 29 । జనవరి । 2023



నేడు మోదమ్మ తీర్థ మహోత్సవం 8లో

పాడేరు మోదకొండమ్మతల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



మన్యం వాసులకు ఊరట

జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరగడం మన్యం ప్రజలకు ఊరట నిస్తోంది. చలితీవ్రత మాత్రం తగ్గలేదు. 8లో



గవరపాలెం కోలాహలం

అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. 8లో

న్యూస్‌రీల్

బొర్రా పంచాయతీకి రూ.1.6 లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని **ప్రముఖ పర్యాటక** కేంద్రమైన బొర్రా గుహల **వద్ద వాహనాల** పార్కింగ్ ద్వారా రూ.1.6 **లక్షల ఆదాయం** సమకూరిందని సర్పంచ్ **అప్పారావు తెలి**పారు. బొర్రా గుహలను **తిలకించేందుకు** వస్తున్న పర్యాటకులకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఐదు ప్రదేశాల్లో స్థలం కేటాయించామని చెప్పారు. ఈనెల 19నుంచి 27 వరకు వాహనాల పార్కింగ్ ద్వారా రూ.1.6 లక్షలు వచ్చిందని, వీటిని పంచాయతీలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సదుపాయానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. పర్యాటకుల నుంచి ఆన్‌లైన్ విధానంలో పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

విదేశీయుని సైకిల్ యాత్ర



సీలేరు చేరుకున్న స్విట్జర్లాండ్ దేశీయుడు జ్యాయికిమ్

గూడెంకొత్తవీధి: స్విట్జర్లాండ్ దేశానికి చెందిన జ్యాయికిమ్ అనే విదేశీయుడు సైకిల్‌యాత్రలో భాగంగా శనివారం సీలేరు చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 మే 27న స్విట్జర్లాండ్‌లో సైకిల్‌యాత్ర ప్రారంభించినట్టు చెప్పారు. 2023 జనవరి 27 నాటికి 18 వేల కిలోమీటర్లు ప్రయాణించానని, ఇరాన్, డెహ్రాడూన్ దేశాల మీదుగా తన యాత్ర సాగిందని వివరించారు. వివిధ దేశాల్లో ప్రజల ఆచారాలు, కట్టుబాట్లు, వారి ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై తాను అధ్యయనం చేసేందుకే ఈ పర్యటన చేపట్టినట్టు తెలిపారు. మన్యంలోని అందాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని వివరించారు.

సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు 30న వేలం

పాడేరు రూరల్: పాడేరు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు పాడేరు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొన దలిచే వారు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వాపసు చేయబడే రూ.5వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అత్యధిక మొత్తానికి పాడుకున్న వ్యక్తి పూర్తి సొమ్మును జీఎస్టీతో కలిపి అదేరోజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు బజాజ్ ఆటోలు, ఒక బజాజ్ మేక్సిమా ఆటో, హీరోహోండా ఎక్స్‌ట్రీమ్, ఫ్యాషన్ బైక్, సీడీ మోటర్ బైక్, హోండా ఏక్టివా, హోండా స్ప్లెండర్ బైక్, బజాజ్ పల్సర్ బైక్‌లకు వేలం నిర్వహిస్తామని ఆయన వివరించారు.

ఇక అద్దాల్లా రోడ్లు..!

- ఉమ్మడి విశాఖలో మరమ్మతులకు రూ.71 కోట్లు
- ఇప్పటికే 'అల్లూరి' జిల్లాలో టెండర్లు పూర్తి
- త్వరలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఖరారు
- జూన్‌లోగా తారు రోడ్ల మరమ్మతుల పూర్తికి సన్నాహాలు
- 903 గ్రామాలకు ప్రయోజనం



మరమ్మతులకు నోచుకోనున్న జి.మాడుగుల మండలం సొలభం-వంతల రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీరాజ్ రోడ్లు కొత్త అందాన్ని సంతరించుకోనున్నాయి. మరమ్మతులకు గురైన ఈ తారు రోడ్లు అద్దాల్లా త్వరలో రూపుదిద్దుకోనున్నాయి.

దెబ్బతిన్న 674.18కి.మీ రోడ్లు..
విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ఈ శాఖ పరిధిలో 259 రోడ్లున్నాయి. వీటిలో 674.18 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా రోడ్లపై ప్రయాణాలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వీటికి మరమ్మతులు చేపట్టడానికి రూ.71.71 కోట్లు మంజూరు చేసింది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ మొదలైంది.

అల్లూరి జిల్లాలో..
అల్లూరి సీతారామరాజు జిల్లాలో టెండర్లు పూర్తయ్యాయి. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో టెండర్లు పురోగతిలో ఉన్నాయి. త్వరలోనే ఇవి ఖరారు కానున్నాయి. అనంతరం వీటి పనులు ప్రారంభించనున్నారు. తొలుత చిన్న చిన్న గోతులను పూడ్చడానికి ప్రాధాన్యమిస్తారు. ఇలాంటి రోడ్లు ఈ మూడు జిల్లాలో 413.67 కిలోమీటర్ల మేర ఉన్నట్టు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. ఆ వెంటనే భారీగా గోతులు పడిన రోడ్లను పటిష్టవంతంగా మరమ్మతులు చేపడతారు. ఈ తరహా రోడ్లు 260.51 కిలోమీటర్ల మేర ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో రోడ్ల మరమ్మతుల వివరాలు ఇలా..

జిల్లా	రోడ్ల సంఖ్య	పొడవు (కి.మీల్లో)	నిధులు (రూ. లక్షల్లో)
అనకాపల్లి	154	352.12	3,229.99
విశాఖపట్నం	36	70.08	382.50
అల్లూరి	69	251.98	3,589.97
మొత్తం	259	674.18	7,171.46

జంగిల్ క్లియరెన్స్..
రోడ్ల మరమ్మతులతో పాటు రోడ్లకిరువైపులా దట్టంగా అలముకున్న మొక్కలు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మరమ్మతుల్లో భాగంగా వీటిని కూడా (జంగిల్ క్లియరెన్స్) తొలగించనున్నారు. ఇలా ఒకపక్క రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు, మరోపక్క జంగిల్ క్లియరెన్స్ చేపట్టడం ద్వారా మూడు జిల్లాల్లోని పంచాయతీ రాజ్ రోడ్లు అద్దాల్లా రూపుదిద్దుకోనున్నాయి. ఈ రోడ్లకు మరమ్మతులు పూర్తయితే 903 గ్రామాల పరిధిలోని 63,828 మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

జూన్ లోగా మరమ్మతులు పూర్తి



ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.71 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ల పక్రియ మొదలవుతుంది. టెండర్లు ఖరారు కాగానే మరమ్మతులు ప్రారంభమవుతాయి. జూన్‌లోగా వీటికి పూర్తి స్థాయిలో రిపేర్లు పూర్తి చేస్తాం.

–బీఎస్ రవీంద్ర, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

గ్రూప్-1 ప్రిలిమినరీలో గిరి పుత్రుల సత్తా



గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన గిరి విద్యార్థులు

- 12 మంది మెయిన్స్‌కు అర్హత
- ఐటీడీఏ సివిల్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్న అభ్యర్థులు

సాక్షి, పాడేరు: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలోని వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో సివిల్స్ శిక్షణ పొందుతున్న గిరి విద్యార్థులు గ్రూప్–1 ప్రిలిమినరీలో సత్తా చాటారు. 14 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఈనెల 8వతేదీన రాష్ట్ర పబ్లిక్ కమిషన్ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. గత 8 నెలల నుంచి వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో 45 మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులు సివిల్స్ శిక్షణ పొందుతున్నారు. అనుభవజ్ఞులైన నిపుణులతో శిక్షణ ఇవ్వడంతో పాటు పూర్తిస్థాయిలో అన్ని మౌలిక వసతులను ఐటీడీఏ కల్పించింది.వీరు తొలి ప్రయత్నంలోనే ప్రతిభ చూపారు.ఈనెల 27వతేదీన గ్రూప్–1 ప్రిలిమినరీ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష రాసిన 45 మంది గిరిజన అభ్యర్థుల్లో 12 మంది మెయిన్స్‌కు అర్హత సాధించినట్టు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు. ఎస్.శ్రీనివాస్, టి.బాస్కర్, వి.గోపిచంద్, ఎ.ఉమాసాయి, కె.సూర్యప్రకాష్, ఏ.వి.ఎస్.కీర్తి, పి.జయరామ్, ఎస్.ఇందిరాకుమారి, బి.శ్రీహరి నాయుడు, కె.ఝాన్సీ, బిడ్డ నవ్య, టి.ఉదయభాను తదితరులు ప్రతిభ కనబరిచారు.

జిల్లాకు గుర్తింపు లక్ష్యం: ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
సివిల్స్‌లో గిరిజన అభ్యర్థులు ప్రతిభ చూపి,ఉన్నత శిఖరాలకు చేరుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో ఉన్నామని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలో సత్తా చాటిన 12 మంది గిరిజన అభ్యర్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రయత్నమే విజయానికి తొలి గెలుపని గిరిజన అభ్యర్థులు గ్రూప్ వన్ పరీక్షల్లో రుజువు చేశారన్నారు. శిక్షణ పొందుతున్న ప్రతి గిరిజన అభ్యర్థి సివిల్స్, పోటీ పరీక్షల్లో విజయం సాధించే వరకు సాధన చేయాలని, ప్రభుత్వం ఐటీడీఏ అన్ని విధాలుగా అండగా ఉంటాయని ఆయన భరోసా నిచ్చారు. సివిల్స్‌లో మంచి ర్యాంకులు సాధించే సామర్థ్యం, సత్తా గిరిజన అభ్యర్థుల్లో ఉందన్నారు. ఏకాగ్రతతో చదువుకుని శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు.

పీవీటీజీల జీవన విధానంపై అధ్యయనం

అర్లాయిపుట్టులో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు



అర్లాయిపుట్టులో పీవీటీసీ గిరిజనులతో సమావేశమైన కేంద్ర బృందం సభ్యులు

ముంచంగిపుట్టు: పీవీటీజీ గిరిజనుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు శనివారం మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ అర్లాయిపుట్టు గ్రామంలో కేంద్ర బృందం పర్యటించింది. సకొంజు బీహారీ కంపెనీ సెక్రటరీ (ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ), గిరిజన సంక్షేమ అఫైర్ కమిటీ న్యూ ఢిల్లీ ప్రతినిధి ఎం.వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఏపీవో డీఆర్ శ్రీనివాసరావు, ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లతో కూడిన బృందం సభ్యులకు గిరిజన సంప్రదాయంలో గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం అర్లాయిపుట్టు గ్రామ పీవీటీసీ గిరిజనులతో బృందం సభ్యులు సమావేశమయ్యారు. వారి జీవన విధానం, స్థితిగతులు, ఆచార కట్టుబాట్లు తదితర వివరాలు తెలుసుకున్నారు. భాసా విధానం, పంటలు, అటవీ ఉత్పత్తుల సేకరణ, కొలిచే దేవతలు తదితర అంశాలపై వారితో మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన మార్పులపై బృందం సభ్యులు తెలుసుకున్నారు. తమ పిల్లలు ఉన్నతంగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నట్టు పీవీటీజీ గిరిజనులు తెలిపారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ అధ్యయన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందజేయనున్నట్టు తెలిపారు. గ్రామాలను కలుపుతూ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు,అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కమ్యూనిటీ భవనం, పంటలకు గిట్టుబాటు ధరలు, ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు తదితర అంశాలను లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ బృందం దృష్టికి తీసుకువెళ్లారు. వెలుగు ఏపీఎం దేవమంగ, సీడీపీవో రాజేశ్వరి, ఏపీవో సూరిబాబు, ఈవోపీఆర్డీ చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చింతపండు అమ్మకాలు ప్రారంభం

10 కిలోలు రూ.500 నుంచి రూ.600

సాక్షి,పాడేరు: మన్యంలో చింతపండు దిగుబడులు ప్రారంభమయ్యాయి. పాడేరు జీసీసీ డివిజన్ పరిధిలోని పాడేరు మండలం వంట్లమామిడి సంత ప్రాంతంలో గిరిజనులు చింతపండు అమ్మకాలను ప్రారంభించారు.10 కిలోల బుట్ట రూ.500 నుంచి 600 ప్రారంభ ధర నెలకొంది. ఈ ఏడాది కాపు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి ముందే వచ్చింది. దీంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది. సరహద్దులోని ఒడిశా గ్రామాల గిరిజనులు కూడా ఏజెన్సీ వారపుసంతల్లోనే విక్రయాలు జరుపుతారు. అనంతగిరి మండలం కాశీపట్నం, మైదాన ప్రాంతాలైన దేవరాపల్లి, వి.మాడుగుల, కోనాం వారపుసంతల్లో అమ్మకాలు జరిపేందుకు గిరి రైతులు సిద్ధమవుతున్నారు.

కొనుగోళ్లకు జీసీసీ ఏర్పాట్లు
గత ఏడాది జీసీసీ 600 మెట్రిక్ టన్నుల చింతపండు కొనుగోలు చేసింది. పిక్కతో చింతపండుకు కిలో రూ.32.40, పిక్కతీసిన చింతపండు కిలో రూ.63 చొప్పున చెల్లించింది. పాడేరు, చింతపల్లి జీసీసీ డివిజన్ల పరిధిలో గిరిజనులు పిక్కతో చింతపండును జీసీసీ, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రంపచోడవరం జీసీసీ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో గిరిజన రైతులు మాత్రం పిక్కతీసిన చింతపండును మాత్రమే విక్రయిస్తుంటారు. ఈఏడాది చింతపండు కొనుగోలుకు జీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. కొనుగోలు ధరలను జీసీసీ యాజమాన్యం కొద్దిరోజుల్లో ప్రకటిస్తుందని జీసీసీ పాడేరు డీఎం కురుసా పార్వతమ్మ తెలిపారు.



వంట్లమామిడిలో అమ్మకానికి సిద్ధంగా చింతపండు

ఘనంగా రథసప్తమి వేడుకలు

పాడేరు రూరల్: మండలలోని డి.గొందూరు పంచాయతీ సూకురుపుట్టు సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు పాటు జరిగిన ఈ వేడుకల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, శ్రీ సూర్య హోమం చేపట్టారు. సూర్యనారాయణస్వామివారి శోభా యాత్రలో మాల ధరించిన భక్తులు దీక్ష విరమణ చేశారు. వేడుకల్లో భాగంగా మూడు రోజులపాటు ప్రత్యేక భజన కార్యక్రమాలు, థింసా, కోలాటం నిర్వహించారు. అన్నసంతర్పన ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా శ్రీ సాయిదత్త పీఠాధిపతి శ్రీ సాయిదత్తా లోకేశ్వరనంద మహారాజ్ స్వామిజీ ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. సూర్యనారాయణస్వామి నామస్మరణతో ఈ ప్రాంతం హోరెత్తింది. ఆలయ ధర్మకర్త, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, గిరిజన అర్చకుల సంఘం అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస, 11 మండలాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న లోకేశ్వరానంద మహారాజ్ స్వామి



అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

పింజరికొండ జలపాతం వెలవెల



నాడు జలకళతో పింజరికొండ జలపాతం

- జలవిద్యుత్ కేంద్రానికి నీరు మళ్లింపు
- నిరాశకు గురవుతున్న పర్యాటకులు

అడ్డతీగల: ఒకప్పుడు ఎత్తయిన కొండల నడుమ ఒంపులు తిరుగుతూ జలకళతో కట్టిపడేసిన పింజరికొండ జలపాతం నేడు వెలవెలబోతోంది. 2006లో సుమారు రూ.కోట్లతో ఇక్కడ నిర్మించిన చిన్నతరహా జలవిద్యుత్ కేంద్రానికి నీరు మళ్లించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. జలవిద్యుత్ ఉత్పత్తికి నీరు మళ్లించేందుకు ఏలేరు వాగుకు అడ్డంగా వియర్ (గోడ) నిర్మించారు. దీని ఎత్తుకు మించి నీరు ప్రవహిస్తేనే పింజరి కొండ జలపాతంలో చేరుతుంది. ప్రస్తుతం వాగులో నీటి ప్రవాహం తక్కువగా ఉంది. అయితే విద్యుత్ ఉత్పత్తి జరగనప్పటికీ నీటి మళ్లింపు యథావిధిగా కొనసాగుతోంది. సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతాన్ని చూసేందుకు వస్తున్న వారు నిరాశకు గురవుతున్నారు. జలపాతం మళ్లీ ఉరకలెత్తాలంటే వర్షాకాలం వరకు ఆగాల్సిందే.



నేడు బండరాళ్లకు పరిమితం

క్లుప్తంగా

నేడు మోదమ్మ తీర్థ మహోత్సవం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మతల్లి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఒకరోజు తీర్థ మహోత్సవం జరగనుంది. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు ప్రారంభిస్తారు. ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులను ఆలయ కమిటీ పంపిణీ చేస్తుండగా, సంతూర్ సబ్బుల కంపెనీ విలువైన బహుమతులను విజేతలకు ప్రకటించింది. మధ్యాహ్నం అన్నసమరాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని పాడేరు పురవీధుల్లో ఊరేగిస్తారు .రాత్రికి కళామందిరంలో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు తీర్థం మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

బస్సు నుంచి జారిపడి గిరిజనుడికి గాయాలు


బస్సు ప్రమాదంలో గాయపడ్డ గిరిజనుడు

చింతపల్లి: మండలంలోని రాజుపాకలు వద్ద ఆర్టీసీ బస్సునుంచి శనివారం ఓ గిరిజనుడు జారి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. జి. మాడుగుల మండలం సంగులోయకు చెందిన కొండపల్లి రామారావు బస్సు ఎక్కుతుండగా ప్రమాదం జరిగింది. ఆయనకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు స్థానిక వైద్యులు తెలిపారు.

మన్యం వాసులకు ఊరట

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు శనివారం కాస్త పెరిగాయి.చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 7.3 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 9 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 9.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలుల తీవ్రత మాత్రం కొనసాగుతోంది, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం కనిపించ లేదు. సూర్యోదయం వేగంగానే అయ్యింది.పాడేరు ప్రాంతంలో మాత్రం తేలికపాటి మంచు కురిసింది.

తగ్గిన ధరలు: రైతుల గగ్గోలు

- పత్తి ధరల పతనం
- నష్టాల్లో రైతాంగం


లారీలో లోడ్ చేస్తున్న పత్తి

రాజవొమ్మంగి: ఈ ఏడాది అధిక వర్షాలు కారణంగా ఓవైపు పత్తి దిగుబడి మరో వైపు ధర బాగా తగ్గిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రాజవొమ్మంగి మండలంలో దాదాపు 2వేల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. అధిక వర్షాల కారణంగా నాటిన మొక్కలు ఊటదేరి చనిపోవడంతో రైతులు పలుమార్లు మొక్కలు నాటారు. అయినే అనుకొన్న రీతిలో మొక్కలు బతకకపోవడంతో పత్తి రైతు నష్టాన్ని చవి చూస్తున్నాడు. కాగా మండల వ్యాప్తంగా శనివారం పత్తి కొనుగోళ్లు నిలచిపోవడంతో పండిన పత్తి ఏం చేసుకోవాలో తెలియని అయోమయ పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఎకరాకు టన్ను (వెయ్యి కిలోలు) దిగుబడిని అయ్యేదని, ఈ ఏడాది కేవలం 3, 4 క్వింటాళ్లు (సుమారు 400ల కిలోలు) దిగుబడి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. గతేడాది కిలో పత్తి రూ. 90 ఉండగా, ఈ ఏడాది రూ.65కు పడిపోయిందని, ఇళ్ల వద్దనే పంటను నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఓ కమిషన్ వ్యాపారి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడమే పత్తి ధర తగ్గిపోవడానికి కారణమై ఉండొచ్చని చెప్పారు.

ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయాలి

ఈ ఏడాది ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు మంచి ఫలితాలు ఇచ్చాయి. అమ్మిన ధాన్యానికి కూడా ప్రభుత్వం సొమ్ములు సకాలంలో చెల్లించింది. ప్రభుత్వం పత్తికి కూడా మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలి. పత్తి సాగుపై ఆధారపడే రైతును ఆదుకోవాలి.

–సుంకర సత్తిబాబు, రైతు, అమీనాబాద్ కాలనీ, రాజవొమ్మంగి

వేద ఘోషతో మార్మోగిన శారదాపీఠం

- అత్యంత ఘనంగా రెండో రోజు వేడుకలు
- పీఠాన్ని దర్శించుకున్న ప్రముఖులు


మంత్రి రోజాకు జ్ఞాపికను అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి


స్వామీజీ ఆశీస్సులు తీసుకుంటున్న బూడి ముత్యాలనాయుడు

సింహాచలం: వేద ఘోషతో పెందుర్తి మండలం చిన ముషిడివాడలో ఉన్న విశాఖ శ్రీ శారదాపీఠం మార్మోగింది. ఐదు రోజులపాటు జరుగుతున్న పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. రథ సప్తమిని పురస్కరించుకుని అరుణ పారాయణం, సౌరయాగాన్ని విశేషంగా నిర్వహించారు. సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శత్రు నాశనం కోసం మన్యుసూక్త హోమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే రాజశ్యామల యాగం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. చాత్తాద వైష్ణవ ఆగమ సదస్సుని నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు సాయంత్రం శారదా స్వరూప రాజశ్యామల సమేత చంద్రమౌళీశ్వరుల పీఠార్చనను ఘనంగా నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారికి పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్, రాష్ట డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా , ఎమ్మెల్యే వరుదు కల్యాణి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. అనంతరం వీరికి స్వామీజీలు ఆశీసులు అందజేశారు.

రాజశ్యామల వైభవం గ్రంథం ఆవిష్కరణ

రాజశ్యామల అమ్మవారి ఉపాసనా కేంద్రం యావత్ భారతదేశంలోనే విశాఖ శారదాపీఠంలో ఉందని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. ఈవిషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఏనాడో చెప్పారని తెలిపారు. ఐదు రోజులపాటు జరుగుతున్న శారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి పీఠాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రాత్రి వార్షిక మహోత్సవాల వేదికపై రాజశ్యామల వైభవం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ 14 సంవత్సరాలు హిమాలయాల్లో సంచరించినపుడు అమ్మవారు ఉపాసనా విధానాన్ని ఒక మహనీయుడు తమకు ఉపదేశించారని తెలిపారు. ఆశక్తితోనే హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే పీఠంగా విశాఖ శారదాపీఠం పేరు గడించిందని తెలిపారు. కలియుగంలో ఇప్పుడున్న పరిస్థితిల్లో పరాశక్తి స్వరూపమైన అమ్మవారి ఆవశ్యమని తెలియజేశారు. తమ ఉపదేశం మేరకే గ్రంథ రచయిత సీతారామాంజేయశర్మ ఈగ్రంథాన్ని ముద్రించారని తెలియజేశారు. కార్యక్రమంలో షత్ శాస్త్ర పండితులు విశవనాథ గోపాలకృష్ణశాస్త్రి, చిర్రావూరి శ్రీరామశర్మ, రామ్‌లాల్ శర్మ, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు.


అరుణ పారాయణాన్ని నిర్వహిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి, పండితులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన చిన్నారి


గాయపడిన చిన్నారులను 108లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: మండలంలోని ఆర్వీ నగర్ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. గూడెంకొత్త వీధి మండలం ధర్మాపురం నుంచి చింతపల్లి మండలం చిలకలమామిడికి మధు, ఆయన భార్య, ఇద్దరు పిల్లలతో బైక్‌పై వెళుతుండగా.. ఆర్వీనగర్ నుంచి ఎర్రవరం వెళుతున్న మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పది నెలల వయసున్న పాపతో పాటు విష్ణుప్రియ అనే నాలుగేళ్ల చిన్నారికి గాయాలయ్యాయి. వారి తల్లిదండ్రులకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు ఆర్వీనగర్ ఆస్పత్రికి తరలించగా వైద్యాధికారి మహేష్‌బాబు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు

డుంబ్రిగుడ: విద్యాలయాల్లో మెనూ సక్రమంగా అమలుచేయాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు అన్నారు. జాముగుడలో గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటనలో మెనూ ప్రకారం భోజనం అందజేయాలని కోరిన విద్యార్థినులను హెచ్‌ఎం దండించినట్టు ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను దండించారన్న విషయం అవాస్తవమైనట్టు దర్యాప్తులో తేలిందన్నారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించకపోతే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చింతపల్లిరూరల్: మన్యంలో గిరిజనులు పండిస్తున్న వివిధ రకాల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐఏఎస్ అధికారులు సమితా, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమారి అన్నారు. మండలంలోని లంబసింగి, లబ్బంగిలో వారు శనివారం పర్యటించారు. గిరిజనులు సాగు చేస్తున్న ఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లంబసింగిలో రైతులతో సమావేశం నిర్వహించారు. కాఫీతో పాటు రైతులు పండిస్తున్న అల్లం, పసుపునకు మంచి ధరలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. రైతులు లాభాలు వచ్చే పంటలపై దృష్టి సారించాలని వారు కోరారు. ఎంపీపీ అనూషాదేవి, ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్ విజయశాంతి పాల్గొన్నారు.

గవరపాలెం కోలాహలం

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచి అమ్మవారి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పట్టణంలోని ఏ వీధి చూసినా జనంతో కిక్కిరిసిపోయింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఉభయ గోదావరి జిల్లాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. గవరపాలెంలో ప్రతి వీధిలో ఒక వేదికను నెలకొల్పి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గవరపాలెం ప్రతి వీధిలోనూ స్టేజ్ ప్రోగ్రామ్‌లతో పాటు, బెంగాల్ లైటింగ్ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తొలుత మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు మంత్రిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అమ్మవారి రథ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీస్‌లు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గౌరీపరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఈవో చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి జయవీర్ సారె, పట్టువస్త్రాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.